# నిర్భయంగా బ్రతుకు

ప్రకాశ్‌ని పిలిచాడు భానుమూర్తి.

అతడు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు "ఏం సర్."

"అదిగో ఆమాటే అనద్దని చెప్పలేదూ ?" నీ పేరు మార్చింది ఎందుకనుకున్నావు.

"ఇది ఆఫీస్‌కదా సర్. ఎక్కడెట్లా ఉండాలో అట్లా ఉండాలి."

"సరేలే, రంగాపురం కేంపువెళ్ళాలి. నీవు కూడా రా."

"సెక్రెటరీగారికి చెప్తానండి.''

ప్రకాశ్ వెళ్ళాడు పి.ఏ గదిలోకి. అతడప్పుడే లోపలికి వచ్చాడు.

''రంగాపురం కేంపుకెళ్ళాలట, ఏర్పాటు చెయ్యమన్నారు అయ్యగారు."

రంగాపురానికి కారుపోదు. అక్కడ రోడ్డు పడలేదు. కాలిబాటగానే ఉంది. ఇరవైమైళ్ళ ఇవతల ఒక టౌనుంది. గెస్టహవుస్‌లో దిగవచ్చు. ఆ తరువాత రంగాపురం చేరటానికి ... ...." అనుకుంటూ ఆఫీసరు రూమ్‌లోకి వెళ్ళాడు సెక్రెటరీ.

"ఆ ఊరికి రోడ్ పడలేదు సర్. పదిమైళ్ళ కాలిబాట ఉంది. వంగపల్లి వరకూ కారుపోతుంది. అక్కడొక గెస్టహౌస్ కూడా ఉంది. ఆ తరువాత...."

''ఇంకా అక్కడ రోడ్డు పడలేదూ ? అయితే ఒకపని చెయ్యి. గెస్టహౌస్ నుంచి ఒక స్కూటరు ఏర్పాటుచెయ్యి. రెండుమూడు గంటలపని అంతే. తరువాత గెస్టహౌస్‌లోనే లంచ్‌కి ఏర్పాటు చెయ్యి. రేపే ప్రయాణం."

సెక్రెటరీ వెళ్ళిపోయాడు

మరునాడు ఉదయం ప్రకాశ్‌తో కారులో బయలుదేరి గంటన్నరలో గెస్ట్ హౌస్‌కి చేరుకున్నాడు భానుమూర్తి. సెక్రెటరీ ఆఫీసర్‌కి కావలసిన ఏర్పాట్లన్నీ టెలిఫోనులో కిందటిరోజు సాయంత్రమే చెప్పటం వల్ల కారువచ్చి ఆగే వేళకు, అన్నీ సిద్ధంగా ఉన్నాయి.

భానుమూర్తి ప్రకాశ్ స్నానాలుచేసి కాఫీ టిఫిన్లు తీసుకున్నారు. భానుమూర్తి పి.ఏ తో "నీవు మాతోకూడా రానవసరం లేదు. మేము భోజనం వేళకు వచ్చేస్తాము. స్కూటర్ ఏర్పాటు చేశావుగా."

"చేశాను సర్. రెడీగా ఉంది.''

ఇద్దరూ స్కూటర్‌మీద బయల్దేరారు. భానుమూర్తి ముందర కూర్చున్నాడు. ఊరు చిన్నదే. కాని ఇళ్ళు ఎక్కువయ్యాయి. ఊరిని రెండుసార్లు చుట్టివచ్చిన భానుమూర్తికి ఇళ్ళ మధ్య చెరువు కనబడ్డది. చిన్ననాటి సంగతులు ఒక్కొక్కటే జ్ఞాపకానికి రావటం మొదలు పెట్టేయి. శీను దగ్గర కొంత, మంగమ్మ దగ్గర కొంత అడిగి తెలుసుకున్నాడు.

"ఆ యిల్లు అప్పుడున్నచోట లేదా? లేక వాళ్ళు ఆ ఊరినుంచి వెళ్ళిపోయారా?" ఒక సందేహం కలిగింది.

ఒకచోట స్కూటరాపుకుని "వెంకటయ్యగారిల్లు ఎక్కడ?" ఎదురుపడిన ఒక పెద్దమనిషిని అడిగాడు భానుమూర్తి.

"అవతల సందులో ఉన్న మొదటి ఇల్లే. ఇటు నుంచి వెళ్ళండి'' అన్నాడు పెద్దమనిషి.

వెంటనే భానుమూర్తి స్కూటరు తిప్పుకుని, సరిగ్గా ఆ యింటిముందరే ఆపి, వీధివాకిట్లో నిలబడి "వెంకటయ్యగారున్నారా?" అంటూ అడుగు ముందుకు వేశాడు.

తలలు నెరిసిన ఇద్దరాడవాళ్ళు లోపలి గుమ్మందగ్గర నిలబడి చూస్తున్నారు. వెంకటయ్య ముందుగదిలో మంచమ్మీద కూర్చుని పొగాకు చుట్టుకుంటున్నాడు.

ఎదురుగా ఆఫీసరు దుస్తుల్లో వచ్చిన భానుమూర్తిని చూసి లేచినిలబడి "ఎవరికోసం?" అడిగాడు దిగ్భ్రాంతితో.

''వెంకటయ్యగారున్నారా ?'' చూసి చాలాకాలమయింది కనుక గుర్తుసరిగా పట్టలేకపోయాడు.

"నేనే వెంకటయ్యను. ఏంపని సర్ ?'' కాళ్ళల్లో కొంచెం ఒణుకు మొదలయింది.

"నేను మంగమ్మగారి మనమడిని. సుమారు పదహారు సంవత్సరాల క్రిందట ఈ ఊరొచ్చాను. ఒకరోజు మీ యింటి అరుగుమీద పడుకున్నాను. ఆ యిద్దరు ఆడవాళ్ళు చాపగుడ్డ అరుగుమీద పడేసి తలుపులు వేసుకున్నారు. అంతకు ముందే ఒక ఉత్తరంతెచ్చి వాళ్ళచేతికిచ్చాను. ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా ?"

తలగోక్కుంటూ ''ఎప్పుడు? ఎప్పుడు? ఎప్పటిమాట ?" వెంకటయ్య చేతిలోఉన్న పొగాకు కాడ జారి కిందపడ్డది.

సుమారు పదహారు సంవత్సరాల క్రిందట-

"ఒరే శీను అమ్మమ్మ చెప్పింది రంగాపురం పక్కఊరని కదూ" అన్నాడు భానుమూర్తి.

''అవును. అసలిది రంగాపురమవునో కాదో అడిగిచూద్దామా వీళ్లను ?''

సరిగ్గా అప్పుడే దోసకాయలమ్ముకునే మనిషి ఎదురుపడ్డాడు. శీను అడిగాడు.

''రంగాపురం ముందరుందండి ''

"ఇక్కడ బండ్లు దొరుకుతాయా ?''

''కాలిబాటే గాని బండ్లుపోవటానికి రోడ్డుపడలేదండి ''

''ఇక్కడికే చాలాదూరం నడిచాం, వీడు నడవలేకుండా ఉన్నాడు."

అయితే ఒకపని చేయండి అక్కడక్కడ ఆగుతూ వెళ్ళండి చీకటిపడక ముందు వెళ్తారు. నాకు బేరాలు పోతాయి" అంటూ వెళ్ళిపోయాడు.

"ఒరే భానూ ఆకలేస్తోందా ? పద. ఆ చెట్టుకింద కూర్చుని మూటలో ఉన్నది తిందాం'' అంటూ పిల్లవాడిని చెయ్యిపట్టుకుని తీసుకువెళ్ళాడు. చెట్టుకింద ఇద్దరూ కూర్చుని అమ్మమ్మ కట్టిఇచ్చిన మూట విప్పారు. బాదమాకుల్లో పెరు

గిన్నం పెట్టుకుని తిన్నాడు. పక్కన ఉన్న టీ దుకాణంలో చేతులు కడుక్కుని చెరొకకప్పు టీ తాగారు. బాదమాకులు కప్పి గట్టిగా కట్టిన మూటను శీను చేతికి తగిలించుకున్నాడు. ఇద్దరూ చేతులు పట్టుకుని బయల్దేరారు.

మధ్యాహ్నం మూడుగంటలకు మెల్లగా ఆ ఊరు చేరారు. "వెంకటయ్య గారిల్లెక్కడ ?" అని అడుగుతూ నడుస్తున్నారు.

ఒక యింటిదగ్గర ఒకావిడ అరుగుమీద కూర్చుని తలవెంట్రుకలారబెట్టు కుంటోంది.

"వెంకటయ్యగారిల్లెక్కడో చెప్తారా ?" అడిగాడు శీను.

"ఆయన ఇల్లు ఇదే. మీకెవరుకావాలి ? ఏంపని ?" లేచి తలవెంట్రుకలు ముడివేసుకుంటూ లోపలికి వెళ్ళబోయింది.

"మా ఊరు పూసపాడు. మంగమ్మగారు ఈ ఉత్తరం మీకిమ్మన్నారు. ఈ అబ్బాయి మంగమ్మగారి మనమడు భానుమూర్తి". శీను ఆమెచేతిలో ఉత్తరం పెట్టాడు.

ఆమె వాకిట్లోకి వచ్చి భానుమూర్తిని పరీక్షగా చూసింది.

"ఆయన చీకటి పడకముందే వస్తారు. పక్కఊళ్ళో వ్యాపారం చేస్తారు. అంతవరకూ అరుగుమీద కూర్చోండి. ఈ చాపమీద" అంటూ ఓ ఈతాకుల చాప యిచ్చి తలుపేసుకుంది.

ఉత్తరం విప్పి చదువుకుంది.

చిరంజీవి కావేరికి దీవించి అమ్మమ్మ వ్రాయునది ఏమనగా మీ పిన్ని పిల్ల వాడిని కని మూడవనెలరాగానే కన్నుమూసింది. మీ తండ్రి సంవత్సరీకాలకు వచ్చినప్పుడు, మీ పిన్నిదగ్గరున్న ఇరవై వేల రూపాయలతో, ఒక ఎకరం భూమి కొంటానని నీ భర్తగారు తీసుకున్నారు. తరువాత మీరు మళ్ళీ రాలేదు. ఎన్ని ఉత్తరాలు రాయించినా మీరు జవాబులు రాయలేదు. ఒకసారి మీ ఆయన మాత్రం భూమిబేరం కుదరలేదనీ ఆడబ్బుతో తను వ్యాపారం చేస్తున్నాననీ ఉత్తరం రాశాడు.

పిల్లవాడికి ఏడవఏడు వచ్చింది. ఈ ఊర్లో మంచి బడి లేదు. నేను మంచి బడి ఉన్న ఊళ్ళో ఉండి చదువు చెప్పించాలనుకుంటున్నాను. మన పక్కింటి పిల్లవాడు శ్రీనివాసు పట్నంవెళ్ళి బట్టలు తెచ్చి ఈ ఊళ్లో అమ్ముతున్నాడు. అతడు మన యింట్లోనే దిగుతాడు. అతడితో ఈ ఉత్తరం పంపుతున్నాను. మీ ఆయనను స్వయంగా వచ్చి ఆ డబ్బు ఇచ్చి వెళ్ళమను. ఇప్పటికే ఆలస్యమైంది.

ఇట్లు

మంగమ్మ వ్రాలు

"వీడా? వీడు నాతమ్ముడా? అచ్చం నాన్నలాగే ఉన్నాడు. ఆయన ఆ డబ్బెప్పుడో ఖర్చుచేసి ఉంటాడు. పులిమీద పుట్రలాగ ఇదొకటొచ్చి పడిందే ఇన్నేళ్ళ తరువాత?"

కావేరి నట్టింట కూలబడి పోయింది.

పిల్లలిద్దరూ మూటలో ఉన్నది తిని బట్టదులిపి తలకింద పెట్టుకుని పడుకున్నారు.

మళ్ళీ కావేరికి కడుపులో గుబులు బయలుదేరింది. "అయినా నాన్న ఇన్నేళ్ళకు మళ్ళీ పెళ్ళిచేసుకోవట మేమిటి? తల్లి కడుపులో ఉండగా తండ్రినీ, పుట్టిన మూడోనెలన తల్లినీ మింగినవాడు ఇంకా ఎంతమందిని మట్టుబెడతాడో? డబ్బు కోసం బతికి మాకు ముప్పు తలపెట్టాడు."

అంతలో తలుపుకొట్టిన చప్పుడయింది. కావేరి తలవెంట్రుకలు ముడివేసుకుని లేచి తలుపుతీసింది.

వెంకటయ్య ఎర్రటి కళ్ళతో తూలుతూ ఇంటికి వచ్చాడు. అతడు లోపల అడుగుపెట్టగానే తలుపువేసింది కావేరి.

ఇద్దరూ భోజనం చేసిన తరువాత తీరికగా ఉత్తరం చేతికిచ్చింది.

"అయితే అరుగుమీద పడుకున్నది వాడేనా?" అడిగాడు వెంకటయ్య.

"ఆఁ వాడే. చాపయిచ్చాను పడుకోమని."

"ఆ డబ్బు ఇచ్చినా మంగమ్మ వీడికోసం ఖర్చుచేస్తుందన్న నమ్మకం ఏమిటి?

డబ్బును చూడగానే ఆవిడకేం బుద్ధి పుడుతుందో ? ఓస్, ఇంతేకదా ? ఏడేళ్ళ పిల్లవాడు ? నీవు ఎక్కువఆలోచించకు. ఆ విషయాన్నిగురించి. అంతా నేను చూసు కుంటానుగా ? నిశ్చింతగా పడుకో" అని మంచమ్మీద నడుంవాల్చాడు.

వెంకటయ్యకు డబ్బుమాట చెవిన పడగానే నిషాఅంతా దిగిపోయింది. బుర్ర పనిచేయటం మొదలు పెట్టింది.

నాలుగవజామున తొలికోడి కూసింది.

దిగ్గున మంచమ్మీదినుంచి లేచాడు.

ఒకరాత్రివేళ చలిగాఉంటే చిన్నపిల్లవాడికి శీనుచాపకప్పాడు తను పక్కకు జరిగి తలకింది బట్టతీసి కప్పుకున్నాడు. అది కాళ్లవరకుకూడా రాలేదు. ముడుచు కుని గోడకు ఆనుకుని పడుకున్నాడు గాని-నిద్ర పట్టలేదు.

అంతలో తలుపుతీసిన చప్పుడయింది. శీను ఇరవైఏళ్లపైన బడ్డవాడు. అతడికి మనసులో ఏవేవో ఆలోచనలు మెదులుతున్నాయి.

వెంకటయ్య చాప గట్టిగాచుట్టి రెండుచేతులతోఎత్తి పట్టుకుని చెరువు దగ్గరికి బయలుదేరాడు

శీను దిగ్గునలేచి అతడికి పది అడుగుల దూరంలో, నెమ్మదిగా అడుగులో అడుగువేసుకుంటూ నడిచాడు.

మరి కాసేపటికి నీళ్లల్లో ఏదోపడిన చప్పుడయింది. వెంకటయ్య తలనిండా బట్టకప్పుకుని దిక్కులుచూడకుండా వచ్చి తలు పేసుకున్నాడు.

శీను చప్పుడుకాగానే షర్టు పాయజామా విడిచి ఒడ్డునపెట్టి అన్నం మూట కట్టిన బట్టచుట్టుకుని నీళ్లల్లోకి దిగాడు.

అప్పటికి తెలతెలవారవస్తోంది. చాపచుట్ట అయిదారు గజాలు తేలుతూ నీళ్లలో ముందుకుపోతున్నది. నీళ్లచల్లగా ఒంటికితగలగానే ఆ చాప చుట్టలోనుంచి ఖానుకేకలు పెడుతున్నాడు కళ్లుమూసుకుని.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ శీను ఆ చాపచుట్టను లాక్కొచ్చి ఒడ్డున పడేశాడు. నడుముదాటిన నీళ్లల్లోనుంచి బరువైన చాపచుట్టను లాక్కొచ్చేటప్పటికి అతడికి ఆయాసంవచ్చింది.

మంగమ్మ తననునమ్మి తల్లిదండ్రులులేని పిల్లవాడినికూడా పంపించిం దనుకుంటూ ఒణుకుతూనే ఆ గుడ్డనువిడిచి పాయ్‌జామా వేసుకున్నాడు. ఆ చాప చుట్టను విప్పి శీను, తడిసిన గుడ్డలు భాను ఒంటిమీదినుంచి లాగేసి తన షర్టును చుట్టబెట్టాడు. చాపను చెరువులోకి విసిరేశాడు.

"నీకేంభయంలేదురా భానూ. నిన్ను ఇంటికి తీసుకువెళ్తాను. నీవు నడవ లేవుగాని నే నెత్తుకుంటాలే" అంటూ శీను తడిబట్టలు ఒక చేత్తో పట్టుకుని, బజాన ఉన్న పిల్లవాడిమీద ఒక చెయ్యివేసుకుని, గబగబా రంగాపురంవైపు అడుగులు వేశాడు.

రంగాపురంలో చెట్టుకింద పొయ్యి వెలిగించి ఒక ముసలమ్మ, పెనంపెట్టి అట్టులేస్తోంది. తెల్లవారగానే జనంవస్తారు-'మాకు ముందంటే మాకు ముంద'ని.

శీను ఆ మొదటి రెండు పెసరట్లూ భానుకు పెట్టించాడు. భానుకు వేడి వేడి పెసరట్లు కడుపులోపడగానే చలి తగ్గినట్లనిపించింది. బరువుమోసిన ఆయాసం తీర్చుకుని, తనుకూడా ఓరెండు అట్లుతిని ముసలమ్మకు డబ్బిచ్చి భాను చెయ్యి పట్టుకుని గబగబా అడుగులువేస్తూ ఆ గ్రామం దాటాడు శీను.

అప్పటికి ఎండపొడవచ్చింది భాను బట్టలుగట్టిగాపిండి గడ్డిమీద ఆరవేశాడు జనం దారివెంట నడుస్తున్నారు. వాళ్లను చూడగానే భయంతగ్గి కాస్త ధైర్యం వచ్చింది. తడీపొడిగాఉన్న బట్టలు చేతపట్టుకుని భానును నడిపించుకుంటూ అతడితో కబుర్లుచెబుతూ ఇంటికి తీసుకొచ్చి జరిగినదంతా చెప్పాడు మంగమ్మతో.

"నాయనా శీనూ, ప్రాణంతో పిల్లవాడిని ఇంటికి తీసుకువచ్చావు. దేవుడంటే ఎక్కడో ఉన్నాడనుకుంటాము. ఆ వెంకటయ్య అటువంటివాడని తెలిసే స్టాంపు కాగితమ్మీద రాయించిఉంచాను. భోజనంచేసి మనం పట్నంపోదాంపద. పోలీసు రిపోర్టు ఇద్దాం. ప్లీడరుగారితోకూడాచెప్పి నోటీసుఇప్పిద్దాము. వాడిని ఒదిలి పెట్టద్దు. డబ్బుకోసం పిల్లవాడిని చంపాలని చూశాడు"

పోలీసులు రాజకీయాలలో తలమునకలుగా ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ కాస్త వయసుమళ్ళినవాడు ప్రమోషన్లకోసం పరుగులు తీయనివాడు. ఇద్దరు పోలీసు లను యస్సైతోచెప్పి, అరెస్టువారంటుతో వెంకటయ్యను ముందు కొట్లోకితోశారు.

కేసు విచారణకు వచ్చిననాడు మంగమ్మతోకూడా శీనూ భానుమూర్తీకూడా

వెళ్లారు. బోనులో నిలబడ్డ వెంకటయ్య భానుమూర్తిని చూడగానే ఆవేశంతో "నీవింకా బతికిఉన్నావట్రా? నీళ్ళలోమునిగి చస్తావనుకున్నాను" అంటూ అరిచాడు. ఇంక ఆ కేసుకు సాక్ష్యం అవసరం లేకపోయినది. హత్యాప్రయత్నంచేసిన నేరం కింద వెంకటయ్యకు జైలుశిక్ష పడ్డది.

"చెప్పానుగా సుమారు పదహారేళ్లక్రిందటి సంగతని? వెంకటయ్యగారూ! జ్ఞాపకముందా చాపలోచుట్టి నన్ను చెరువులో పారేసిన సంగతి? ఇదిగో ఈ శీను నన్ను చెరువులోనుంచి బైటికితీసి యింటికి తీసుకెళ్లాడు. "నీ వింకా బతికే ఉన్నావట్రా? నీళ్లలోపడేస్తే చస్తావనుకున్నాను" అంటూ బోనులోంచి అరిచి జైలుకు వెళ్లటంకూడా మరిచిపోయారా?''

"బాబ్బాబూ బుద్ధిగడ్డితిని........"

"చూడండి వెంకటయ్యగారూ, మనిషిబతికి పైకిరావటానికి డబ్బు ముఖ్యం కాదు. ధైర్యం కృషి కావాలి. నా డబ్బుపెట్టి మీరు సుఖాలను కొనుక్కుని అనుభవించారు. జైలుకూ్కడావెళ్లారు. డబ్బులేక నేను వారాలు చేసుకుంటూ చదువుకున్నాను. కష్టపడ్డాను. ఆఫీసరు నయినాను నేను ఇప్పుడు మీదగ్గర్నుంచి డబ్బు వసూలు చెయ్యటానికిరాలేదు. నేనింకా బతికేఉండి, అడుక్కుతింటూ చదువుకుని, ఆఫీసర్నయ్యానని చెప్పటానికివచ్చాను. గజగజ ఒణుకుతున్నావు కిందపడతావు జాగ్రత్త. మంచమ్మీదకూర్చో. నేను కావాలంటే నీ యిల్లు వేలంవేయించి డబ్బు తీసుకోగలను. కాని ఎందుకోతెలుసా? మా అమ్మమ్మ కసీ కక్షా పెంచుకోకు నాయనా. అవిరెండూ మనిషిని నాశనంచేస్తాయనిచెప్పింది. నేనందుకు నీ గడపలో అడుగుపెట్టలేదు. పిచ్చిపనులు చేయకుండా నిర్భయంగా బతకటం నేర్చుకో" గిర్రున తిరిగి స్కూటరుమీద శీను నెక్కించుకుని గెస్టుహౌస్‌కి భోజనం వేళకు అందుకున్నాడు భానుమూర్తి-తన ప్రియమైన మిత్రుడు-ఆత్మీయుడూ-ఆపద్బాంధవుడూ అయిన శీను కాదు-కాదు ప్రకాశ్‌తో"

*